# 'విత్తన బిల్లు'తో వ్యవసాయం కార్పొరేట్ల పరం

- కేంద్రం ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాం
- రైతు వ్యతిరేక బిల్లును వెంటనే ఆపివేయాలి
- నకిలీ విత్తన కంపెనీలకు రక్షణ.. రైతుల పొట్టకొట్టేలా నిబంధనలు
- ట్రయల్స్ లేకుండానే విదేశీ విత్తనాలు.. దేశీయ భద్రతకు ముప్పు
- రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్రం
- త్వరలో నిపుణులతో రౌండ్ టేబుల్ సమావేశం





**హైదరాబాద్, డిసెంబర్ 11 (మనసులో మాట):**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నూతన విత్తన బిల్లు మ-ంసాయిదాను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది పూర్తిగా రైతు వ్యతిరేకమని, కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేలా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ బిల్లును తక్షణం నిలిపివేసి.. రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు, రాజకీయ పార్టీలతో కూలంకషంగా చర్చించిన తర్వాతే ముందుకెళ్లాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రతిపాదించిన డ్రాఫ్ట్‌పై పార్టీ తరఫున ఆయన సుదీర్ఘమైన ఫీడ్‌బ్యాక్‌ను పంపించారు.

కార్పొరేట్ల కోసమేనా ఈ చట్టం? 'ఈజ్ ఆఫ్ బిజినెస్' పేరుతో విత్తన రంగంపై ఆధిపత్యాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. విత్తన ధరల నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేకుండా చేయడం ఇందులో భాగమేనన్నారు. నకిలీ విత్తనాల తయారీ కంపెనీలను బాధ్యులను చేయకుండా.. కేవలం అమ్మకందారుల పై నెపం నెట్టేలా చట్టాన్ని రూపొందించడం దారుణమన్నారు. నకిలీ కంపెనీలను బ్లాక్ లిస్ట్ చేయడం, భారీ పెనాల్టీలు, జైలు శిక్ష వంటి కఠిన నిబంధనలు బిల్లులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

విదేశీ విత్తనాలతో ముప్పు.. ఎలాంటి ప్రయోగాలు నిర్వహించకుండానే విదేశీ కంపెనీలు తమ విత్తనాలను నేరుగా దేశంలో అమ్ముకునే వెసులుబాటు ఈ బిల్లులో ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల దేశీయ విత్తన సార్వభౌమత్వం, బయోసేఫ్టీ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. సంప్రదాయంగా రైతులు విత్తనాలు తయారు చేసుకునే పద్ధతులకు ఈ బిల్లులో రక్షణ కరువైందన్నారు.

రాష్ట్రాల హక్కులకు గండి.. వ్యవసాయ రంగం రాష్ట్రాల పరిధిలోని అంశం కాగా.. విత్తనాలపై కేంద్రం పెత్తనం చెలాయించేలా ఈ బిల్లు ఉందని కేటీఆర్ విమర్శించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రాలు సొంత చట్టాలు చేసుకునే అధికారాన్ని ఇది బలహీనపరుస్తుందన్నారు.

### బీఆర్ఎస్ డిమాండ్లు ఇవే..

1. రైతే కేంద్రంగా, రైతు ప్రయోజనాలే పునాదిగా కొత్త బిల్లు ఉండాలి.
2. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు.. ఎకరానికి వచ్చే గరిష్ట దిగుబడి ఆధారంగా, నిర్దిష్ట సమయంలోగా పరిహారం చెల్లించేలా కఠిన చట్టం తేవాలి.
3. విత్తన సార్వభౌమత్వానికి భంగం కలగకూడదు.

ఈ అంశంపై త్వరలోనే మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, ఎంపీ వినోద్ కుమార్‌ల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, కేంద్రానికి మరిన్ని సూచనలు చేస్తామని కేటీఆర్ వెల్లడించారు.

# రబీకి 'యూరియా' కష్టాలు ఉండవ్

- రైతులు ఆందోళన చెందొద్దు
- ఎరువుల కొరత రానివ్వం: కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- జానకంపేట సొసైటీ గోడౌన్‌లో ఆకస్మిక తనిఖీ
- రికార్డులు, స్టాక్ నిల్వల పరిశీలన
- స్టాక్ బోర్డులో వివరాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశం



**నిజామాబాద్, డిసెంబర్ 11 (మనసులో మాట):**

రబీ సీజన్‌లో పంటల సాగుకు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం ఆయన ఎడపల్లి మండలం జానకంపేటలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన: గోడౌన్‌లోని రిజిస్టర్లలో నమోదైన నిల్వలకు, భౌతికంగా ఉన్న స్టాక్‌కు సరిపోలిక ఉందా లేదా అని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువుల విక్రయాలన్నీ పారదర్శకంగా 'ఈ-పాస్' మిషన్ల ద్వారానే జరగాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు ప్రణాళిక: స్టాక్ పూర్తిగా అయిపోయేదాకా వేచి చూడకుండా, కొంత నిల్వ ఉన్నప్పుడే ఇండెంట్ సమర్పించి ఎరువులు తెప్పించుకోవాలని సొసైటీ నిర్వాహకులకు సూచించారు. గోడౌన్ బయట ఉన్న స్టాక్ బోర్డుపై ప్రతిరోజూ ఎరువుల నిల్వల వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎరువులు అందుబాటులో ఉండేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఒకే రోజు రెండు విజయవంతమైన లాప్రోస్కోపిక్ సర్జరీలు

### అపెండిసైటిస్, గాల్ బ్లాడర్ రాళ్ల సమస్యలకు పరిష్కారం

### వైద్య బృందాన్ని అభినందించిన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్

**పెద్దపల్లి, డిసెంబర్ 11 (మనసులో మాట):**

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయి. అత్యాధునిక పరిజ్ఞానంతో వైద్యులు క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి పేదల ప్రాణాలు కాపాడుతున్నారు. తాజాగా ఇద్దరు రోగులకు లాప్రోస్కోపిక్ (కీ హోల్) పద్ధతిలో ఆపరేషన్లు నిర్వహించి వైద్యులు శభాష్ అనిపించుకున్నారు. అపెండిసైటిస్ సర్జరీ తుర్కల మద్దికుంట గ్రామానికి చెందిన 33 ఏళ్ల మహిళ గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆమెను పరీక్షించిన జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, స్కానింగ్ ద్వారా ఆమెకు 'అపెండిసైటిస్' (అపెండెక్స్) ఉందని నిర్ధారించారు. వెంటనే స్పందించిన వైద్య బృందం.. లాప్రోస్కోపిక్ విధానంలో సర్జరీ చేసి సమస్యను పరిష్కరించారు. గాల్ బ్లాడర్ రాళ్ల తొలగింపు కూనారం గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువకుడు గత రెండేళ్లుగా కుడి వైపు కడుపు నొప్పితో సతమతమవుతున్నాడు. అతనికి స్కానింగ్ చేయగా గాల్ బ్లాడర్ (పిత్తాశయం)లో రాళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో డాక్టర్ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలోని బృందం అతనికి 'లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ' సర్జరీని విజయవంతంగా పూర్తి చేసింది. ఈ రెండు ఆపరేషన్లను విజయవంతం చేసిన జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ విష్ణు చంద్రిక, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రామం, డాక్టర్ స్వాతి, రేడియాలజీ



వైద్యులు డాక్టర్ సుప్రియ, డాక్టర్ సంధ్యారాణిలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలతో, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బు వృథా చేసుకోకుండా, ప్రభుత్వ ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

### కలెక్టర్ సిక్తా పట్నాయక్ సీరియస్

### 74 మందికి షోకాజ్ నోటీసులు

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

### మొదటి విడత ఎన్నికల్లో గైర్హాజరైన సిబ్బంది

**నారాయణపేట, డిసెంబర్ 11 (మనసులో మాట):**

ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించి, విధులకు గైర్హాజరైన సిబ్బందిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ కొరడా ఝుళిపించారు. గురువారం జరిగిన మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికల విధులకు జిల్లా వ్యాప్తంగా 74 మంది సిబ్బంది డుమ్మా కొట్టారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్.. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఉపేక్షించేది లేదు.. ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమైనదని, ఇందులో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నోటీసులకు సరైన వివరణ ఇవ్వకపోతే తదుపరి చర్యలు ఉంటాయని పరోక్షంగా హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని సిక్తా పట్నాయక్ తేల్చిచెప్పారు.



# ప్రైవేటు ఆసుపత్రుల్లో 'రేట్ల పట్టిక' ఉండాల్సిందే..

### రిసెప్షన్‌లో ధరల జాబితా, డాక్టర్ల వివరాలు డిస్‌ప్లే చేయాలి

### పాల్వంచలో డీఎంహెచ్‌వో తుకారాం ఆకస్మిక తనిఖీ

### నిబంధనలు ఉల్లంఘిస్తే సీరియస్ యాక్షన్



**కొత్తగూడెం/పాల్వంచ, డిసెంబర్ 11 (మనసులో మాట):**

జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలకు సంబంధించిన ధరల పట్టికను ప్రజలకు కనిపించేలా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆదేశించారు. బుధవారం పాల్వంచలోని శ్రీ విజయ నర్సింగ్ హోమ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కీలక ఆదేశాలు జారీ: ఆసుపత్రి నిర్వహణ తీరును పరిశీలించిన అనంతరం యాజమాన్యానికి పలు కీలక సూచనలు చేశారు. రోగులకు అందించే సేవలు, ల్యాబ్‌లో చేసే రక్త పరీక్షల ధరల వివరాలను రిసెప్షన్ వద్ద స్పష్టంగా ప్రదర్శించాలి. ఆసుపత్రిలో పనిచేసే వైద్యుల పేర్ల జాబితా కూడా బోర్డుపై ఉండాలి. ఇంజెక్షన్ వైల్స్ మూత తీసిన వెంటనే, వాటిపై ఆ తేదీ, సమయాన్ని కచ్చితంగా నమోదు చేయాలి. ప్రసవాలు చేసే గదులను పరిశుభ్రంగా ఉంచాలి, మందులను నిబంధనల ప్రకారం నిల్వ చేయాలి. తనిఖీల్లో గుర్తించిన లోపాలు మళ్లీ పునరావృతం కాకూడదని, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ తుకారాం రాథోడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పీఎంవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నాగరాజుకు కేటీఆర్ అభినందనలు

### ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

### సాధారణ స్థాయి నుంచి బ్రిటన్ ఎగువ సభ వరకు.. మీ ప్రయాణం స్ఫూర్తిదాయకం

### ఇంగ్లాండ్ రాజు చేతుల మీదుగా నామినేట్ కావడంపై హర్షం



**హైదరాబాద్, డిసెంబర్ 11 (మనసులో మాట):**

బ్రిటన్ పార్లమెంట్ ఎగువ సభ అయిన 'హౌస్ ఆఫ్ లార్డ్స్' సభ్యుడిగా ఎంపికైన ప్రవాస భారతీయుడు ఉదయ్ నాగరాజుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మనోడికి దక్కిన ఈ అరుదైన గౌరవంపై కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. మీ ప్రస్థానం గర్వకారణం: ఈ మేరకు కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ ఉదయ్ నాగరాజును కొనియాడారు. "ఇంగ్లాండ్ రాజు చేతుల మీదుగా హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా నామినేట్ అయినందుకు ఉదయ్ నాగరాజు గారికి నా మనస్ఫూర్తిగా అభినందనలు. గతంలో యూకేలో పబ్లిక్ ఆఫీస్ కోసం పోటీ చేయడం దగ్గరి నుంచి మొదలుకొని.. నేడు ఈ అత్యున్నత గౌరవం దక్కించుకోవడం వరకు మీ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. మీ కొత్త బాధ్యతల్లో మీకు అంతా మంచే జరగాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# తార్నాక రోడ్లకు మహర్దశ.. నాణ్యతలో రాజీ పడొద్దు!



### తూతూ మంత్రంగా వద్దు.. శాశ్వత పరిష్కారం కావాలి

### అధికారులకు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ఆదేశం

### క్షేత్రస్థాయిలో రోడ్డు పనుల పరిశీలన

### అభివృద్ధికి నిధుల కొరత రానివ్వం: స్థానికులకు హామీ

**హైదరాబాద్, డిసెంబర్ 11 (మనసులో మాట):**

తార్నాకలో దెబ్బతిన్న రోడ్లకు మోక్షం లభించనుంది. రోడ్ల విస్తరణ, మరమ్మతులపై గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి తార్నాకలోని 'స్వీట్ నంబర్ వన్ లైన్' (స్ట్రీట్ నంబర్ 1) ప్రాంతంలో జరుగుతున్న కొత్త రోడ్డు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నాణ్యతే ముఖ్యం: ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన డిప్యూటీ మేయర్.. తార్నాక డివిజన్‌లో రహదారుల దుస్థితిని ప్రస్తావించారు. ఏదో చేశాం అనిపించుకోవడం కాకుండా, శాశ్వత ప్రాతిపదికన నాణ్యమైన రోడ్లను నిర్మించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అండగా..: అనంతరం ఆమె స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తార్నాక అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీ బడ్జెట్ నుంచి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు.



# సంగీతం శ్రీనివాస్‌కు ఘన సత్కారం

**గంభీరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ గురువారం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని కి నాంపెల్లి వక్ఫ్ బోర్డు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు చైర్మన్ సంగీతం శ్రీనివాస్ ను జిల్లా అధ్యక్షునిగా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గంభీరావుపేట మండలానికి చెందిన కాంగ్రెస్ మైనారిటీ సీనియర్ నాయకులు సంగీతం శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ యాసీన్ హుస్సేన్, మహమ్మద్ అయ్యుబ్ ఖాన్, మహమ్మద్ నాసీర్, నయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాగౌడ్‌కు సేవారత్న పురస్కారం




**గంభీరావుపేట:** హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం జరిగిన 9వ తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఏర్పాటు దినోత్సవం, వృద్ధుల హక్కుల రక్షణ దినోత్సవంలో గంభీరావుపేట వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు మల్లుగారి నర్సాగౌడ్ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా 'సేవారత్న పురస్కారం' అందుకున్నారు. వృద్ధుల సంక్షేమం, మానవతా సేవలకు అంకితంగా పనిచేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న నర్సాగౌడ్ సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్టాత్మక అవార్డు ప్రదానం చేశారు. ఈ వేడుకలో జస్టిస్ బి చంద్రకుమార్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి అనిత రామచంద్రన్, మహిళా,శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఐఏఎస్ పి సుధాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కోదండరాం, సాధికారత విభాగం ప్రొఫెసర్ మసన చన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి



**గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం నర్మాల పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా రాజబోయిన అర్చన ఆంజనేయులు ఎన్నికల బరిలో నిలిచారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ ప్రచారం కొనసాగిస్తున్నారు. గతంలో గ్రామ అభివృద్ధికి తాము చేసిన సేవలకు ప్రజలు మంచి గుర్తింపు ఇచ్చారని, ఈసారి సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కుల, మత భేదాలు లేకుండా ప్రతి ఓటరును కలిసి గ్రామ అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# కాంగ్రెస్ అభ్యర్థులకు గుణపాఠం చెప్పాలి



**తాండూర్:** ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. రెండవ విడత స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి దుర్గం గంగారాం బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. ఎంతమంది నిజమైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, రాజీవ్ యువ వికాసం రూ.5 లక్షలు ఎవరికి వచ్చాయని ప్రశ్నించారు. ఎంతమంది మహిళలకు రూ.2500 నిరుద్యోగ భృతి, కళ్యాణలక్ష్మిలో భాగంగా తులం బంగారం ఎంత మందికి ఇచ్చారని, వృద్ధులకు ఇస్తామన్నా రూ.4వేల పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు అందరూ ఆలోచించి ఎవరు గెలిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తారని ఆలోచించి ఓటు వేయాలని కోరారు. మద్యానికి, మాంసానికి, డబ్బుకు ఆశపడి విలువైన ఓటును అమ్ముకోవద్దని సూచించారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు పురుషోత్తం గౌడ్, దత్తు దొర, ఎలుక రామచందర్, పేరక రాజన్న, చింటూ, సాత్ బాబా, బాబు ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మొదటి విడత ఎన్నికలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్ :** మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మొదటి విడత ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని కెరమెరి మండలం కొరారి గ్రామపంచాయతీ లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలను ఎస్పి నితిక పంత్, ఎన్నికల పరిశీలకులు వి.శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం జరిగిందని, అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగిందని తెలిపారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరి చూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచిస్తూ పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రం ఆవరణలో పోటీ చేయు సర్పంచ్, వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నారని, జిల్లాలో ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరిగిందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత నమూనాలో నమోదు చేయాలని స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. మధ్యాహ్నం 1 గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు వరుసలో ఉన్న వారందరికీ ఓటు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని, సమయం ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి ఎవరిని అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు లోబడి ఎన్నికల ప్రక్రియ నిర్వహణ

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**వాంకిడి:** నిబంధనలకు లోబడి మొదటి విడత పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం వాంకిడి మండలం బెండార పంచాయతీలోని నిర్వహించిన పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను జిల్లా ఎస్పి నీతికపంత్, ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఓటరు జాబితా ప్రకారం ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. మొదటి విడత ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరిగిందని, ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత నమూనాలో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు వరుసలో ఉన్న వారందరికీ ఓటు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, మధ్యాహ్నం 2 గంటల నుండి నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలీలు, ఊరేగింపులు నిషేధం

**నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు ● ఎస్పీ నితికా పంత్**



**ఆసిఫాబాద్ :** జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటి చర్యలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ నితికా పంత్ స్పష్టం చేశారు. గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఉండాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్న సందర్భంగా, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అందరూ సమన్వయం పాటించాలని తెలిపారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు, ఎలాంటి అసాంఘిక చర్యలు చోటుచేసుకోకుండా చూసేందుకు మొత్తం 750 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో ప్రత్యేక బందోబస్తు, క్యూ.ఆర్.టి టీంలు, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచబడ్డాయని ఆమె తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, ర్యాలీలు లేదా ఊరేగింపులు నిర్వహించుట కొరకు సంబంధిత అధికారుల ఉత్తర్వుల మేరకు వారు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే జరుపుకోవాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని, ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని ఎస్పీ సూచించారు.



# పోలింగ్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలి



**నేరడిగొండ(ఇచ్చోడ):** మొదటి విడత గ్రామపంచాయతీ పోలింగ్ కేంద్రాల పరిశీలన సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది డ్యూటీలు, ఓటర్ల సౌకర్యాలపై సమాచారం సేకరించి పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని, ప్రతి ఓటరుకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, పారదర్శకత అత్యంత ముఖ్యమని అన్నారు.

# దక్షిణ మధ్య రైల్వేలో న్యాయవాదులకు అవకాశం.. దరఖాస్తుల ఆహ్వానం

**క్యాట్, రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్స్‌లో ప్యానెల్ అడ్వకేట్ల నియామకం**

**హైదరాబాద్, అమరావతి బెంచ్‌ల కోసం నోటిఫికేషన్**

**జనవరి 9, 2026 లోపు దరఖాస్తు చేసుకోవాలి**

**పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించండి**

**సికింద్రాబాద్, డిసెంబర్ 11 (మనసులో మాట):**

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో న్యాయపరమైన సేవలు అందించడానికి ఆసక్తి, అర్హత గల న్యాయవాదుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ హైదరాబాద్, అమరావతి సర్క్యూట్ బెంచ్) మరియు రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్స్ సికింద్రాబాద్, అమరావతి) తరఫున వాదించేందుకు ప్యానెల్ అడ్వకేట్లను నియమించనున్నారు. నమూనా దరఖాస్తు, పూర్తి నోటిఫికేషన్ వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల న్యాయవాదులు తమ దరఖాస్తులను జనవరి 9, 2026 లోపు సమర్పించాలి. దరఖాస్తులను నేరుగా సికింద్రాబాద్ రైల్వే భవన్ (రైల్ నిలయం), 3వ అంతస్తులోని డి.జి.ఎం/లా కార్యాలయంలో సమర్పించవచ్చు. ఈమెయిల్: లేదా కు ఈమెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. ఈ నోటిఫికేషన్‌ను సంబంధిత బార్ అసోసియేషన్ల నోటీసు బోర్డులపై ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

# కౌంటింగ్‌పై దిశానిర్దేశం

**క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు**

**ఎల్కతుర్తి, కమలాపూర్, దామెర కేంద్రాల్లో తనిఖీలు**

**సిబ్బందికి సూచనలు**

**హనుమకొండ, డిసెంబర్ 11 (మనసులో మాట):**

మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను హనుమకొండ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.శివకుమార్ నాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం ఆయన ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు చింతలపల్లి, దామెర, బావుపేట, కమలాపూర్ మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ శాతం, శాంతిభద్రతల పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం పోలింగ్ ముగిసిన తర్వాత చేపట్టాల్సిన కౌంటింగ్ ఏర్పాట్లు, ఫలితాల వెల్లడి ప్రక్రియపై ఎన్నికల సిబ్బందికి కీలక సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం పకడ్బందీగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జడ్పీ సీఈవో రవి, ఎంపీడీవోలు బాబు, విజయ్ కుమార్, కమలాపూర్ తహసీల్దార్ సురేష్ కుమార్, ప్రసాద్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

